# తెరవెనుక జీవితాలు

సీతారత్నం వయస్సు ఇంతని చెప్పుకోవటం కొంచెం కష్టము. ఆవిడ ఏవయస్సులో పెరగటం నిల్చిపోయిందో బాగా ఎరిగినవాళ్ళకి తప్ప తెలియదు - పెద్దలు అబ్బో ఇప్పటిదా! ఏనాటి సీతారత్నం అనటం.

పిన్నలు అబ్బే అన్నేళ్ళు వుండవండీ. వాళ్ళ ఆయన్ని చూసి, ఆవిడకి ఏళ్ళు పెంచితే ఎలా? అని ఖండించటం బంధు కోటిలో అప్పుడప్పుడు వచ్చే సంశయాల్లో అదొకటి. సీతారత్నం చూస్తూండగా అందరి కళ్ళు ఆశ్చర్యంతో తెరుచుకుని వుండగానే చాలా పెద్దింటి అధికారిణై కూర్చుంది.

కొన్ని మార్పులు పరిసరాల్ని అసలు కదపలేవు. అందులో గొప్పింటి పిల్ల బీదయింటి కోడలైతే కొద్దిగా చెప్పుకు వదిలేస్తారు. కానీ సీతారత్నానికి అవి రెండూ జరగలేదు. సామాన్యంగా వున్న ఇంట్లోనే పెరిగింది. వెళ్ళినచోటుకూడా ఏమంత వున్నవాళ్ళు కారని తృప్తిగా చెప్పుకున్నారు. చాలా కాలం జీవితం మసక తెరచాటునే గడిచింది - రంగయ్య చెప్పా చెయ్యకుండా వెంకయ్య నడిపే లారీయెక్కి హైదరాబాదు చేరాడు. సీతారత్నం భర్తజాడ తెలియక ఏడ్చింది. ఉపవాసాలు వుంది. ఆరాలు తీసింది. చివరికి వెంకయ్యతో వెళ్ళాడని తెల్సి వెంకయ్య భార్యని తిట్టిపోసింది. ఎన్నో కబుర్లు పెట్టింది. తిరిగి వచ్చే ఆశ కనబడటంలేదు. ఓ సంధ్యావేళ వంటినున్న నగలు తీసి కొంగులో కట్టుకుంది. నల్లపూసల గొలుసు మెరుపు తరగలేదు. వెంకయ్య భార్య కొనుక్కుంటా నంది. ముందు ఇవ్వబుద్ధి పుట్టలేదు. పోనీలే అన్నీ తీసేశాక

యిది మాత్రం ఎందుకులే, అన్న తీర్పుచేసుకు వెంకయ్య భార్య చేతిలో పెట్టింది. ఎదురింటి పంచలో పసుపుతాడుకి నల్లపూసలు గుచ్చుతున్న బాలమ్మ 'ఏంటి వదినో మంతనాలు ఆడుతున్నారు. నేను వినొచ్చా' అంటూ కేకపెట్టింది.

'నీకు తెలవంది ఏమి జరిగిందిలే,' అంటూ నగలమ్మి తనూ రంగయ్య దగ్గరికి వెళ్ళిపోతానని చెప్పింది సీతారత్నం.

'మెడ ఎంత బోసిపోయిందో! ఈ పూసలు నువ్వేసుకో. ఈసారి నేను తెచ్చుకుంటాలే,' అని బాలమ్మ సీతారత్నం మెళ్ళో వేసింది గుచ్చిన రెండుపేటల నల్లపూసలు.

బాలమ్మ పెనిమిటిని తీసుకువెళ్ళి నగలమ్మింది. ఇరుగూ పొరుక్కి చెప్పి ప్రయాణమైంది.

'ఈదే చిన్నబోద్ది.' అంటూ పేరమ్మ కళ్ళువత్తుకుంది.

సీతారత్నం తోడుగా చిట్టెయ్యని పిల్చుకొచ్చింది. రంగయ్యకి సీతారత్నాన్ని చూడగానే చిత్తెత్తుకొచ్చింది. "ఏం కొంపమునిగిందని, అప్పుడే వచ్చావు" అంటూ అరిచాడు.

చీదర్లు చిరాకులూ సర్దుకున్నాక సీతారత్నం తను తెచ్చిన డబ్బుసంగతి చెప్పింది.

రంగయ్య వున్న ఇంటి ఎదరస్థలం తీసుకు సున్నంగానగ పెడతానంది. కట్టెలడితీకూడా పెట్టు ఒదినే అంటూ చిట్టెయ్య మాట కలిపాడు.

రంగయ్యకి రెండూ నచ్చలేదు. అయినా వద్దనలేదు. కొందరు పెట్టినవేళే నంటారు. కాదులే సీతారత్నం తెలివంటారు. ఏమైనా రెండేళ్లు తిరిగేసరికి కలపఅడితీగా మారింది.

ఏటా పెరుగుతూ వస్తోంది. ఆ ఏడు సిమ్మెంటుకోటా వచ్చేసరికి చిట్టెయ్య తనకి వాటా పెట్టమని చాటుచాటుగా అనటం రంగయ్యకి నచ్చలేదు. నెలసరికి ఇంత అని ఇస్తా. వుంటావా వుండు లేదా అంటూ ఖచ్చితం చేశాడు రంగయ్య.

చిట్టెయ్యకి యిష్టంలేకపోయినా ఆ పనీ పోతుందేమోనని వూరుకున్నాడు.

మళ్ళీ ఏడు లారీ కొన్నాడు రంగయ్య. వెంకయ్యని తన పనిలోకి పిలిపించాడు. డబ్బు తిరుగుతోంది, వ్యాపారం పెరుగుతోంది. కాని సీతారత్నానికి మన స్తిమితం తగ్గుతోంది. బాలమ్మ వుత్తరం వేయించింది తన పెనిమిటికి ఏదైనాపని ఇప్పించమని, సీతారత్నానికి.

మెళ్ళో మెరిసే నల్లపూసల్ని తిప్పిచూసుకుంది. ఎంత ఐశ్వర్యం పెరిగినా నల్లపూసల్ని బంగారంతో చుట్టించలేదు. అదోనమ్మకం. అపూసలే అదృష్టాన్ని తెచ్చినట్టు మనస్సు ఎన్నో సార్లు సీతారత్నానికి చెప్పుకుంది.

రంగయ్యకి చెప్పి బాలమ్మ పెనిమిటిని పెద్దకార్లో పెట్టించింది.

కాలం డబ్బుని మూటలుకడుతూ తొందరగా తిరుగుతోంది.

రంగయ్య హోదాకి ఆ ఇల్లు తగదంటూ అంతస్తు పెంచారు సన్నిహితులు.

సీతారత్నానికి ఆ ఇల్లు మారడం ఇష్టంలేదు. దీనికేమి వచ్చిందే! ఇది వదలి కదలనంది.

ఆఫీసు ఇందులో వుంటుందిలే అని రంగయ్య నచ్చచెప్పి చూశాడు.

సీతారత్నం పట్టువిడువలేదు. పాతఇల్లుకొని అక్కడే కొత్తది కట్టమని మళ్ళీ సలహాఇచ్చారు. పెద్ద ఎత్తులో ఇల్లు పెరిగింది. ఎంతవుంటేమటుకు ఇంత ఆడంబరమా, ఇది నిల్చే ఐశ్వర్యమేనా; అంటూ సాధించింది సీతారత్నం.

ఇళ్ళలోకి రాకముందే చాలామంది బంధువులు వచ్చారు. బాలమ్మని, వెంకయ్య భార్యని అక్కడే వుండమని సీతారత్నం పట్టుపటింది. చిట్టెయ్యమటుకు తప్పించుకు

తిరుగుతున్నాడు. సీతారత్నం నిలేసింది - మీ ఆవిడ్ని తీసుకురా లేదేం అని.

దాని బుద్ధి నువ్వెరగంది గనకాఏం? నే రమ్మంటే వస్తుందా! పెద్ద పాఠం చదివింది. 'సరైన బట్టా నగా ఏం కొన్నావని పిలవంగనే వచ్చేందుకు' అని ఒకటేగోల మొదలెడితే వళ్ళుమండి రెండిచ్చానని చిట్టెయ్య సన్న కంఠంతో చెప్పాడు.

సన్నాసిబుద్ధి డబ్బుమీదకి పోతోన్నట్టువుంది. నిక్షేపం లాంటి భర్తవుండగా దానికేం పోయేకాలమంట; అంటూ చిట్టెయ్యభార్యనితిట్టి చిట్టెయ్యకి రహస్యంగా మొల్లోంచి డబ్బు తీసి ఇచ్చి దానిక్కావల్సినవి కొనిపడెయ్యి అంది సీతారత్నం.

చిట్టెయ్య మనస్సు తేలికయింది. డబ్బుతో చేయినిండాక, సీతారత్నం ఎదరే ఎంతో హడావిడిగా పందిళ్ల దగ్గరనించి వంటలదాకా కనుక్కుంటూ, ఆ సందడి తగ్గేదాకా ఇంటికి వెళ్ళనట్లే తిరిగాడు.

కొత్తఇల్లు దీపాలతో కలకల్లాడుతోంది. వచ్చిన బహుమతులు అలమార్లు నిండాయి. ఇల్లు ఎల్లా సర్దాలో నీదీబాధ్యత అంటూ రంగయ్య వెంట ఒక అమ్మాయిని తీసుకువచ్చి చూపెడుతున్నాడు.

బడలికగావున్న సీతారత్నం మడత మంచంమీద నడుం వాల్చింది.

రంగయ్యకాలు మంచానికి తగిలింది. అబ్బబ్బ ఎన్ని సార్లు చెప్పినా నీకు బుద్ధిరాదు. ఎన్ని కొంటేయేం; అనుభవించటం నేర్చుకోలేకపోయాక. ఈ మంచం రేపు విరక్కొట్టి పారేయిస్తానంటూ సీతారత్నాన్ని విసుక్కొన్నాడు.

కొత్తిల్లు కట్టాక రంగయ్యతో అమ్మాయి తరచూ వస్తూవుంటం సీతారత్నం చూసినా అంత పట్టించుకోలేదు.

ఆ రోజు వెంకయ్యభార్య రొప్పుతూ వచ్చింది. మాట పూర్తిగారాక పెదిమలు వణుకుతున్నాయి. జుట్టుముడి సగం వూడింది. కంటిరెప్పలు వుబ్బి కళ్ళఎరుపుని సగం దాచినా కోపం కొలుకుల్లోంచి బయటపడుతోంది.

"ఏం! వంట్లో బాగాలేదా;" అని అడిగింది సీతారత్నం.

"వంటికేం, దుక్కలా వున్నా." మిగిలినమాట పూర్తి చెయ్యకుండానే ఏడుస్తోంది.

రంగయ్య కారుచప్పుడువిని పక్కగదిలోకి తప్పుకుంది. వెంకయ్య పెట్టె పరుపు పట్టుకు మేడపైకి వెళ్లాడు.

జరిగినకొంగు సరిచేసుకు వచ్చిన బంధువు లెవరా అని కళ్ళు పెద్దవిచేసుకు చూస్తోంది సీతారత్నం.

రంగయ్య వెనకే వయ్యారంగా నడుస్తూ వచ్చింది అమ్మాయి.

"చూడు రత్నా! ఈ సరసూకి ఇల్లుదొరికేదాక మన ఇంట్లో వుంటుంది. మేడపైన మూలగది ఇస్తే బాగుంటుందేమో" నంటూ కళ్ళల్లోకి చూశాడు రంగయ్య. "ఏం ఇది వరకే ఈ ఊళ్ళో వుంటోంది అన్నారుగా; ఆ కొంప ఏమైంది," అని సీతారత్నం రంగయ్యని కోపంగా అడిగింది.

రంగయ్య మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్ళాడు. సీతారత్నం వెంకయ్య భార్యని భోంచెయ్యమని బలవంత పెట్టింది.

'కడుపునిండినట్టేవుందిలే,' అంటూ 'కళ్ళువత్తుకుంటూ నాకు రైలుచార్జీకి డబ్బులు పడై. నేను మావోళ్ళ ఇంటికైనా పోతా. నాకు కుదర్దులే ఈ య్యవ్వారం. నువ్వుఅంటే అన్నీ

కడుపులో పెట్టుకు కుళ్లుతావు, నావల్లకాదు. ఆడు అడిగిందల్లా ఆడు ఆడిందల్లా నేను చూస్తూ ఆనందించాలంట; ఇంకా ఇను. దాన్ని తెచ్చి ఇంట్లో పెడతాడంట. నేనేమో నోరు మూసుకు క్కూకోవాలంట. నాకేం ఖర్మ? వక్కనాటికి వూరుకోను' అంటూ వెంకయ్యభార్య చెపుతోంది.

'వూరుకోక చేసేదేమిటిలే' అంటూ సీతారత్నం సముదాయించింది.

రంగయ్య చెయ్యి తుడుచుకుంటూ వచ్చి కుర్చీలో నడుం వాల్చాడు.

వెంకన్న భార్య తిండి తినకుండా డబ్బుతీసుకు వెళ్ళి పోయింది.

"సరసూ తిందేమో కనుక్కున్నావా?" అని రంగయ్య అడిగాడు.

సీతారత్నం వినపడనట్టు వెళ్ళిపోయింది.

సాయంత్రం రంగయ్య బయల్దేరే వేళకి సరసూ తయారై వచ్చింది. వెంకయ్య కారు తలుపు తెరచి పట్టుకున్నాడు. చుట్టుచెంగాయి వెంకటగిరి చీర గాలికి కదులుతూండగా వయ్యారంగా పమిటని సగం కిందికి వదలి నడుస్తూ కారు దగ్గరికి వెళ్ళి కొంగు సగం ఇవతల పడేలా సీటులోకూర్చుంది.

ఆ కొంగు చేతిలోకి తీసుకు రంగయ్య కారెక్కికూర్చోవడం కిటికీ సందులోంచి సీతారత్నం చూసింది. రంగయ్య, సరసూ తన్నిచూసి నవ్వుతున్నారని తెలిసి మనస్సు విరిగింది.

దూరంగా పనివాళ్ళు మొహాలు చూసుకుంటూ కళ్ళెగరెయ్యటం, పళ్ళికిలించటం చూసి, తన్నెవరో అవమానించి నట్లయింది సీతారత్నానికి.

సంధ్యదీపం, మొదలు దేముడింట్లో వెలిగితే కాని మరెక్కడా వెయ్యరు పనివాళ్ళు. ఇంటి చుట్టుపక్కల ఇళ్ళ దీపాలు వెలుగు ఇంటిలో చీకటిని ఎక్కువ చేసినట్టు వుంది.

వంటవాడు దేముడింటిలోకి చూసి దీపమేశాడు. యజమాని ఎక్కడా కనపడక హాల్లో దీపం వెలిగించి వరండాలు అన్నీ నెమ్మదిగా తిరిగి, చివరికి పెరటిలో వున్న నేరేడుచెట్టు మొదట ఇసకగుట్టమీద కూర్చున్న సీతారత్నాన్ని చూసి నిర్ఘాంతపోయాడు. నీటిచారలపైన పడ్డ దీపంకాంతి కూడా మసగ్గానే మెరిసింది.

సీతారత్నం మొహం పక్కకి తిప్పుకుని "నీకు తోచింది వండు. ఆ దీపం తీసెయ్యి" అని ఎండిపోయిన కంఠంతో చెప్పింది.

వంటవాడు ఏదో అడగాలన్నట్టు కాస్సేపు నిల్చుని అడక్కుండానే వెళ్ళిపోయాడు.

సాయంత్రం కారులో రంగయ్యతో కలిసి నవ్విన సరుసూ ముఖం గుర్తుకి వచ్చింది. కోపం పళ్ళల్లోంచి బయట పడింది. మనస్సులో ఏదో బాధ, మళ్లీ దుఃఖం. ఆలోచనల్ని ఆపి చీకటిలో ఎంతోసేపు ఏడ్చింది. ఇదివరకు రంగయ్యగుణం ఎరిగున్నా మనస్సు సమాధాన పడింది. ఇప్పుడు వయస్సుతో మనస్సు కూడా పెరిగి ఎదురు తిరుగుతోంది. ఇంట్లో తనకి ఇంకేం గౌరవం వుంటుంది. నౌకర్లతో పాటే తనూ అనుకుంది. పోనీ కొంచం పెద్ద.

నౌకరుగా చూడవచ్చు. ఐనా తనే కనక రాకపోతే రంగయ్యకి ఇన్ని అలవాట్లు అయ్యేవి కావేమో అనుకుంది. మళ్ళీ అంతలోనే మనస్సు మంచిది, లేకపోతే ఎప్పుడూ చెడ్డ బుద్ధులు వెంటేవుంటాయని సమాధాన పడింది.

చిన్న సంసారంలో గుడ్డిదీపం వెలిగిస్తూ పెద్ద భవిష్యత్‌ని వూహించలేక చీకటిలో మత్తివూడల్లా, ఆలోచనలు అంతులేకుండా తిరిగేవి. అప్పుడు రోజులే పెద్దవిగా జరిగాయి. యజమాని ఎక్కువ మిద్దింట్లోనే గడిపాడు. ఇప్పుడు రోజులు తొందరగా తిరుగుతున్నా, చీకటి చాలా తక్కువే. ఆ ఇంట్లో మూడో ఝాముదాకా దీపాలపందిరిలా వుంటోంది. రంగయ్య

మనస్సులో డబ్బుని చూసుకుంటూ క్రీనీడన బ్రతుకుతున్నాడు. ఇప్పుడు తనవసరం ఆ ఇంట్లో లేదేమో. తను వెళ్ళేందుకు మాత్రం ఎవరున్నారు! వెంకయ్య భార్యకి తల్లి వుంది. తోడబుట్టినవాళ్ళున్నారు. వెళ్ళింది ఆ ధీమాతో. మళ్ళీ దుఃఖం వచ్చినా నీటిధారలు జారలేదు. కంట్లో తడి ఆరిపోయింది.

'చాలా పొద్దుపోయింది రండి అమ్మా' అని వంటవాడు పిలుపుతో తేరుకుంది. ఆకల్లేదు. నువ్వువెళ్ళు అంది. మళ్ళా ఆలోచించే వోపికలేక వరండాలోవున్న వుయ్యాల బల్ల మీద నడుంవాల్చింది! కలతనిద్ర పీడకలలతో నిద్రపట్ట లేదు. మేడమీద నీలంలైటు ఇంకా వెలుగుతోంది. గట్టిగా నవ్వులు వినిపిస్తున్నాయి. ఆ చెట్టుదగ్గరే మనస్సుకి కాస్త బాగున్నట్టు వెళ్ళిన సీతారత్నం ఆ ఇసుకమీదే నడుంవాల్చింది.

రంగయ్య వంటరిగా సీతారత్నంఎదట పడటంలేదు. ఏదో అంటుంది. తనేదో చెపుతాడు. తిడుతుంది. తనేమో చెయ్యి చేసుకోవటం బాగుండదు. ఇదివరకులా ఇప్పుడు ఆ పరిస్థితి రానివ్వకూడదు. తన హోదాకితగినట్లు నడుచుకోవాలి. పైగా 'చదువుకున్న సరసూకి తనమీద గౌరవం తగ్గితే' అన్న ఆలోచన తనలో అస్తమానం తిరుగుతోంది. అందుకే సరసూని ఎక్కువసేపు వంటరిగా విడిచి వెళ్ళటంలేదు రంగయ్య.

ఆ వాతావరణానికి మనస్సుని తిప్పుకుంది. ఇదివరకటిలా, నౌకర్ల పైన ఆథారిటీ చెలాయించాలని లేదు. అసలు వాళ్ళని తను పిలవటమే మానేసింది తనకి కావల్సిన పనులు తనే చేసుకు మళ్ళీ నేరేడుచెట్టు దగ్గరే కూర్చోటం. రోజులో మూడువంతులు మౌనంగానే గడిచిపోతోంది. మిగిలింది నిద్రలో. తెల్లవారుఝామున పక్షుల రెక్కలు విదిలించటం, వేగుచుక్క పసివాడి నుదుట మెరిసే చుక్కలా కదలకుండా వెలగటం, కొండవెనక ఆకాశం ఎరుపు అంచు చీరలో చుట్టు కోవటం, కొబ్బరిచెట్టు మువ్వలో మెరిసిన వెలుగు, మామిడి చెట్టు గుబుర్లో కదిలి పరిసరాలని తన రంగుతో కప్పినట్లు వెల్తురు కళ్ళల్లో పడేటంతవరకూ మనస్సులో ఏదో ఆనందం తనకే తెలియకుండా పొందుతోంది. కాని, మళ్ళా కాకులు అరవటం, మనుష్యులు కదలటం పెద్దకంతాలతో అరుపులు, దూరంగా రైళ్ళకూతలు, పనిమనిషి బొంగురుగొంతు, అన్నీ కలసి, అద్దంమీద గండ్రుయిసకతో రుద్దిన శబ్దంలా మనస్సులో బాధకలిగించేవి సీతారత్నానికి ఈ రోజుల్లో.

రంగయ్య సగంమత్తులో ఎవరిపైనో అరుస్తున్నాడు. సున్నంబట్టీ దగ్గరవుండే గోవిందు గొణుక్కుంటూ పెరటి గుమ్మం దాటాడు.

పనివాళ్ళు తగవు మొదలెట్టారు. సీతారత్నం అక్కడికి రావటం చూసి సర్దుకున్నారు.

వెంకయ్య పెద్దకారు బయటికితీసి తుడిపిస్తున్నాడు రంగయ్య విసుక్కుంటూ మెట్లు దిగుతున్నాడు.

సీతారత్నం పెరట్లోకి వెళ్ళిపోయింది. ఆ రోజు ఎండకి చెట్టుకింద ఇసకవేడెక్కింది. హాలు పక్కగదిలోకి మడతమంచం జరుపుకుంది. పక్కింటి మేడపైన పిల్లలుచేసే అల్లరికి చెవులు ఘళ్ళుడుతున్నాయి. పొద్దు తొందరగానే దిగిపోతోంది. సీతారత్నం మంచంమ్మీద కూర్చుని దూరంగా పుల్లవిరిగిన గులాబీ మొక్కని చూస్తోంది. పక్కగదిలో రంగయ్య గొంతు మోగింది. 'ఎప్పుడు నేను ఇస్తున్నానా: ఎళ్ళి అమ్మగార్నే అడుగు' అని.

'అమ్మగారు మీకాడే వున్నారుగా!' అంటూ బొంగురుగా నవ్వుతోంది పనిమనిషి.

కీచుగొంతు, పిల్లఏడుపులా నవ్వటం వినబడుతుంది. రంగయ్య అదలింపుతో

పనిమనిషి బయటికి పోయింది. కారు కదిలిన చప్పుడు.

సీతారత్నం మనస్సు మొదట చిన్నపుచ్చుకున్నా మళ్ళా సమాధానపడింది. పనిమనిషి అన్నదని ఎందుకు బాధపడాలి; దానికితోచింది అనాలనుకుంది అంతే. ఎక్కడికైనా వెళ్ళాలని వుంది ఆ ఇల్లువిడిచి. కాని ఎక్కడికి వెళ్ళటం; చిట్టెయ్య ఎందుకో ఈమధ్య రావటంలేదు పెళ్ళాం కడుపుతోవుందని ఎంతో మురిసిపోతూ చెప్పుకున్నాడు. వెళ్ళి చూసివస్తే. వాడికి తగింది కాకపోయినా ఎంతప్రేమగా చూసుకొంటాడు. పాపం అది ఎప్పుడూ ధుమధుమలాడుతూనే ఉంటుంది. చిట్టెయ్యకి ఏదైనా ఇప్పించి వుండాల్సింది. ఎక్కువ కష్టపడ్డవాడు వాడేనాయె.

వాడికి డబ్బిస్తే వాడిసుఖం చస్తుంది. ఇవ్వకపోతేనే మంచిది, అన్న నిర్ణయానికి వచ్చి, బయటికితీసిన ఇనప్పెట్టె తాళం మళ్ళీ బొడ్డులో పెట్టేసుకుంది. సీతారత్నం కొద్దిగా డబ్బు తీసుకు చిట్టెయ్య ఇంటికి బయలుదేరింది. వీలుంటే రెండురోజులు వుండాలనుకుంది. వెళ్ళే చోటుచెప్పకపోయినా వెడుతున్నట్టు వంటవాడికి చెప్పి వెళ్ళింది. బస్సెక్కి చాలాకాలమైంది. చాలాసేపు నిల్చుంటేకాని దొరకలేదు. అంతా ఇళ్ళకి పాయేవేళాయె అనుకుంది. బస్సుదిగినా వాళ్ళింటికి కొంత దూరం నడవాలాయే. అప్పుడే చీకటిపడింది. వెళ్ళటం మానేద్దామా అనుకుంటూ వుండగానే బస్సురావటం, తనవరకుఖాళీ వుండటంతో ఏ ఆలోచనా లేకుండా ఎక్కికూర్చుంది. చీకట్లో ఇల్లు తొందరగా కనుక్కోలేక అటూ ఇటూ తిరిగిఎల్లాగో చేరింది. ఇంటితలుపులు మూసివున్నా దీపపుకాంతి తలుపు సందుల్లోంచి తొంగిచూస్తోంది. పెరట్లోకి వెళ్ళింది. అలికిడి లేదు. చింతచెట్టు చీకట్లో ఏడుస్తున్నట్లు గాలికి హోరుపెడుతోంది. మళ్ళావీధివేపుకి వచ్చింది. చిట్టెయ్య భార్య సంచిపుచ్చుకు ఎదురొచ్చింది.

ఎప్పుడేంటి రావటం అని ముభావంగా సీతారత్నాన్ని పలకరించి తలుపుకితాళం లేకుండ మూసివున్నాయే అంటూ పెరట్లోకి వెళ్ళింది చిట్టెయ్యభార్య. గుంజటంలో పెరటి తలుపు తెరచుకుంది. క్రీనిడలో చిట్టెయ్య పక్కనగాజులు గలగల్లాడాయి. సీతారత్నం వెనక్కి తిరిగింది. బిట్టెయ్య భార్య ఆవేశంతో అరుస్తోంది.

చిట్టెయ్య వీధిగడియ తీసుకు వెళ్ళిపోయాడు. సన్నగా నల్లగా, నూలుపోగులాంటి అమ్మాయి పక్కింటిచీకటిలో కలిసి పోయింది. గాజులు చప్పుడు కీచురాళ్ళుగా మారాయి.

చిట్టెయ్య భార్య ఏడుస్తూనే తిడుతోంది. ఈ వూరు ఏ యేళప్పుడు పిల్చుకొచ్చావో ఇట్లాటి బుద్ధులు పుట్టాయి, అంటూ సీతారత్నాన్ని ఆడిపోసింది. మళ్ళా చిట్టెయ్యమీద విరుచుకుపడింది ఇంత బుద్ధిలేనివాడివి అసలు పెళ్ళి ఎందుకు చేసుకున్నావు అంటా? అలుపు వచ్చేదాకా అల్లా అడుగుతూనే వుంది. సమాధానం చెప్పేందుకు అక్కడ చిట్టెయ్య లేడు. నిర్వికారంగా బుడ్డిదీపం మిణుకుమిణుకు మంటోంది.

సీతారత్నం ఆ రాత్రి అన్ని జాములు పెరటిగట్టుమీదే గడిపింది. జీవితం అంతా ఒక్క చీకటిరాత్రిలా తోచింది. జీవుడు పడే బాధలో తేడా లేకపోయినా, జీవితాలు కప్పిన రంగురంగుల తెరలు, అందులో మెదిలే గొప్పబాధ, సామాన్యులు అందరికీ ఎప్పుడో వకప్పుడు మనస్సు బండబారకమునుపు, మెరుపులాంటి బాధలేని జీవుడు వుంటుందా! అన్న ప్రశ్న వేసుకుంది. సమాధానంగా పక్కింటి ఆచారిగారి పురాణం గుర్తుకి వచ్చింది.

సీతమ్మవారు ఆంజనేయుల్ని అడిగిందట. 'పరస్త్రీలను కన్నెత్తి చూడడుకదా!' అని మళ్ళీ నిస్పృహతో 'నే చేసిన ఈ దీక్ష అంతా వృధాయే అవుతుంది. ఈ గడువులో తను రాడు. నేను ఈ వుపవాసాలతో తనువు చాలిస్తా. తనేమో మరో సౌందర్యవతిని చేపట్టి పట్టాభిషేకం

చేసుకుంటాడు.' అలా ఆ దేవే బాధపడ్డదట.

దాంపత్యానికి ఆదర్శంగా ఇన్ని యుగాలుగా చెప్పుకుంటున్న ఆమెకే బాధ తప్పనప్పుడు మట్టిముద్దలాంటి ఈ కాలపు జీవితాలకి బాధతప్ప ఇంకేం వుంటుంది? ఆ కాలంలో ఆమె వుహించేందుకే ఇష్టపడక బాధపడింది. యుగధర్మం మారింది. ఇప్పుడు చూసినా నమ్మకు. విన్నా అడక్కు. అడిగినా సమాధానం వినకు వింటే నీ స్థానం మారవచ్చు అన్న సూత్రం నల్లబట్టలా మనస్సుని కప్పి మాటని పైకి రానివ్వకుండా అడ్డంగా నిలుస్తుంది. అందుకే ఇప్పుడు అభిమానం చంపుకు, గౌరవంగా కలల్లో కరిగిపోవాలేమో! మెదడు ఆలోచనలతో మొద్దుబారింది. తన పిచ్చిపిచ్చి ఆలోచనలకి తనే నవ్వుకుంది. చీకటి పల్చబడుతోంది. దూరంగా వెల్తురు వళ్ళు విరుచుకున్నట్లు వుంది. అత్తింటి కోడలిలా చీకటి, చెట్ల గుబురుల్లో మణిగింది. వధువుని కవ్వించే వరుడు చూపులా చీకటిని చుట్టుకుంది. తల్లికంట పడకుండా ప్రియురాలివంటి భార్యని తన తెల్లదుప్పటి వెనుక దాచింది వుదయకాంతి.

అబ్బా అంటూ మూలుక్కుంటూ ఆలోచించకుండా వుండేందుకు ప్రయత్నింస్తోంది సీతారత్నం. దూరంగా చీపుళ్ళ చప్పుళ్ళు అక్కడక్కడ వినబడుతున్నాయి. సూర్యోదయం మిలమిల్లాడుతూ తూర్పువాకిలి తెరిచింది. గదిలో దీపం వెలవెలపోయింది. చిట్టెయ్య భార్యని బతిమలాడటం ఇంకా పూర్తికానట్టు కంఠంలో జాలి వినపడుతోంది.

ఇక్కడికి తనెందుకు వచ్చినట్టు? వీళ్ళని తనెందుకు ఈ వూరికి తెచ్చినట్టు? సమాధానం తనే చెప్పుకోవాలి.

చిట్టెయ్య మీదవున్న గౌరవం పోయింది. వక్క డబ్బు పిచ్చి తప్ప ఇంకేమీ దుర్గుణాలు లేవని, రంగయ్యతో ఎన్నోసార్లు తను తగవులాడ్డం గుర్తుకొచ్చింది. ఆడిమంచి నువ్వే మెచ్చుకోవాలని రంగయ్య దెప్పటం ఇందుకే అయివుంటుంది. ఏమైనా చిట్టెయ్య భార్యకి వొకొంప కట్టించి ఇవ్వాలి అన్న తీర్పు చేసుకుంది సీతారత్నం. తను చెయ్యగలిగింది ఇంకేమివుంది; అదికూడా రంగయ్య వొప్పుకోకపోతే అన్న సందేహం మళ్ళీ మనస్సుని నీర్సపెట్టింది.

ఏమైనా ఏదో కొంత ముట్టచెప్పాలి. ఇందుకేనా తెచ్చావు? అన్నమాట మనస్సులో మారుమోగుతోంది సీతారత్నానికి.

ఇంటికి బయలుదేరింది. వెళ్ళాలనిలేదు. మళ్ళీ కూర్చుంది. లోపలనించి చిట్టెయ్య భార్యతో మామూలుగా మాట్లాడ్డం వినబడుతోంది. ఎవరికీ చెప్పకుండా పెరటిగుమ్మం తీసుకు బయలుదేరింది సీతారత్నం.

బస్సులు వెడుతున్నాయి. చూస్తూ నిల్చుంది. పొద్దు నెత్తిమీదకి వచ్చింది. వేడిగాలిని కలుపుకు పరిసరాల్ని కాలుస్తోంది. బస్సు నిల్చింది. ఇంటికి చేరేసరికి రంగయ్య మధ్యగదిలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు.

చూడనట్టు సీతారత్నం మండువాదాటి వరండాలోకి బోయింది.

సీతా అన్న కేక ఎన్నాళ్ళ తరవాతో వింది. ఆశ్చర్యంగా తిరిగి చూసింది.

రంగయ్య ఏదో చెప్పబోయి వూరుకున్నాడు. సరసూ వయ్యారంగా అక్కడికి రావటం చూసి సీతారత్నం మొహం తిప్పుకు పెరట్లోకి వెళ్ళిపోయింది. సీతారత్నం నిద్ర లేచేసరికి వెల్తురు తగ్గినా వుక్క తగ్గలేదు. సంధ్య చీకటి పెరటి గోడని తాకింది. స్నానం చేసినా మనస్సుకి

సుఖంగా లేదు. హాల్లో లైట్లు తీసేసి ఫ్యాన్‌కింద కూర్చుంది.

రంగయ్య ఇంటికి రావడం చూసి పక్కగదిలోకి తప్పుకోబోయింది.

రంగయ్య కండువా కుర్చీమీదకి విసిరి సీతారత్నం పక్కగా కూర్చున్నాడు. మడతమంచం కసిరినట్టు చప్పుడు చేసింది. ఏదో మాట మొదలుపెట్టి మళ్ళీ వూరుకున్నాడు.

సరసూ గడప అవతలే నిల్చుని తను వచ్చినట్టు సన్నగా దగ్గి కంఠం తగ్గించి "ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారే. లోపలికి రావచ్చా," అని చంటిపిల్లలా ముద్దుగా మాట్లాడుతూ మంచం దగ్గరకి వచ్చి మంచంచివర మరొకరు వుండటం చూసి రెండడుగులు వెనక్కి జరిగి లైటేసి సీతారత్నాన్ని చూసింది.

సిగలో పిన్నులు సరిచేసుకుంటూ సీతారత్నం మంచం దిగింది.

రంగయ్య ఇద్దర్నీ వకచోటచూడటం, అంతదగ్గరగా చూడటం అదే మొదటేమో. ఇద్దర్నీ చూస్తున్నాడు రెప్ప వెయ్యకుండా.

నవ్వుతూ, కులుకుతూన్నప్పుడే సరసులో అందం కనబడుతుంది. కోపంగావుంటే చూడబుద్ధి పుట్టలే. ఆరిన కొరకంచు గుర్తుకొచ్చింది రంగయ్యకి.

చెరిగిన జుట్టు నుదురుకి అతుక్కుంది. గుండ్రటి మొహంలో విశాలమైన కళ్ళు మెరుస్తున్నాయి. ముడుచుకున్న పెదాలు గుండ్రటి భరిణిలా ఎర్రగా మెరుస్తున్నాయి. మెళ్ళో నల్లపూసలు దీప కాంతికి పల్చగా కదిలినట్టు జాలిగా తనకేసి చూస్తున్నట్టు తోచింది. సీతారత్నం నవ్వకుండా వుంటే ఎంత బాగుంటుంది అని అప్పుడు తోచింది రంగయ్య మనసుకి. ఏదో గుర్తుకి తెచ్చుకున్నట్టు కండువాతీసి దులుపుకుంటూ హాల్లోకి వెళ్లాడు! రంగయ్య వెనకే సరసూ విసురుగా వెళ్ళింది.

రంగయ్య అటూ ఇటూ తిరుగుతున్నాడు.

"ఏమండీ, ఏమిటి, ఆవిడకి చెప్పారా" అంటూ కంఠంలోకి మార్దవాన్ని తెచ్చుకునేందుకు తాపత్రయపడుతోంది సరసూ.

వెంకయ్యా అని కంచులా మోగింది రంగయ్యకంఠం. అంతగట్టిగా పిలవటం ఈ ఇంట్లోకి వచ్చాక అదే మొదలేమొ. వెంకయ్య త్రుళ్లిపడ్డాడు. వచ్చి ఎదురుగా నిల్చున్నాడు.

వెంకయ్యని చూడకుండానే, "చూడు ఈవిడ వాళ్లకి డబ్బు పంపుతాను. వాళ్ళ ఏర్పాట్లు చేసుకోమను పెళ్ళికి" అన్నాడు రంగయ్య.

పక్కగదిలో వున్న సీతారత్నానికి ఈ మాటలు వినపడ్డాయి. ఎవరితోటో పెళ్ళి అర్థంకాక గుండెలు దడదడలాడాయి.

"అంటే మీ వుద్దేశ్యం నన్నెవడికో డబ్బు చూపెట్టి కట్టబెట్టమనా" అంటూ బల్లల్నీ కుర్చీలనీ దొర్లిస్తూ హాలు అంతా హడావిడిచేసింది సరసూ.

"నీ కోరిక అదేగా; పైగా కొత్తవాడేం కాదుటలే. నీ వుద్యోగం వంకన అక్కడికేగా వెళ్ళటం" అని రంగయ్య కోపంగా అనటం ఇంట్లోవున్న నౌకర్లు తలుపుల పక్కన నిల్చుని వింటున్నారు.

"ఛా, డబ్బు వుండగానే సంస్కారం వుంటుందను కోవడం నాదే పొరపాటు. మంచి పాఠమే చెప్పారులెండి. నాకేం మీ వెధవడబ్బు అక్కర్లేదు." కొంగుతో కళ్ళునొక్కుకుంటూ మెట్ల దగ్గరకి వెళ్లింది సరసూ.

"నా డబ్బు అంటే ఏవగించుకునేదానివి అంత డబ్బు సర్దాలకి పనికివచ్చిందా ఏం అని రంగయ్య దెప్పాడు.

వెంకయ్య పిల్చుకొని వచ్చిన మనిషి ధుమ్మధుమలాడుతూ రంగయ్యకేసి చూస్తు నిల్చున్నాడు.

"ఎంత గొప్పోడివైతేమాత్రం మాట తప్పటం ఏం బాగుంటుందేం. ఎంత సదివితే మాత్రం మా పిల్లకి మేవంటే ప్రేమలేకుండా వుంటుందా? మా ఇంటికొత్తేనే కూపీలు లాగుతున్నావంట. నీ బుద్ధికిమల్లేనే అనుకున్నావుకామాలు. ఐనా నిన్ను కట్టుకు ఏం సుఖపడద్దిలే. నేను అప్పుడే సెప్పినా, వయసుమళ్ళినోడి తోటి ఏటే నీకు అని. నీకు తెల్దలే, అని నా నోరు మూయించింది మా పిల్ల. లేకుంటే ఇంతదాక చనువు యివ్వనిచ్చేవోడినేనా?" అంటూ పైగుడ్డతో మూతిని తుడుచుకున్నాడు, సరసూ పినతండ్రి గురవయ్య.

సరసూ కొన్ని సామాన్లు కిందికి చేర్చింది ఆయాస పడుతూ.

"ఏంటి బుల్లీ! పిచ్చికుక్కల్లే తరవంగానే పారిపోవడమేనా ఏం; నాకు తెలీకడుగుతున్నా' అంటూ లేచాడు గురవయ్యా.

"బాబాయి నువ్వూరుకో. నాకు తెల్సులే" అంటూ పైకివెళ్ళి మిగిలినవి మోసుకొచ్చింది సరసూ.

'ఏంటే తెల్సేది. ఈడా ఆడా వున్నావని తెలిస్తేవో డన్నా నిన్ను కట్టుకుంటాడా.' అంటూ "ఇంతకుముందేమొ తనే కట్టుకుంటానని మాటిచ్చె. ఇంతలో ఈయనమేస్తుంటేనన్ను చూస్తూ వూరుకోమంటావా," అంటూ గురవయ్య గట్టిగా అరిచాడు.

వెంకయ్య గురవయ్య చెయ్యిపట్టుకు వెనక్కి గుంజాడు తగ్గమన్నట్టు.

"నువ్వు ఆడించిన నాటకమేగా ఇదంతా," అంటూ వెంకయ్యతో కలియపడ్డాడు గురవయ్య.

ఇద్దర్నీ విడదీసేందుకు ఇంటిలోనివాళ్ళంతా ఏకమయ్యారు.

వెంకయ్య తల గొళ్ళానికి కొట్టుకు నెత్తురు చిమ్మింది.

చిరిగిన చొక్కాని సవరించుకుంటూ గురవయ్య తిట్టడం మొదలుపెట్టాడు.

ఈసారి వెంకయ్య గురవయ్యని బైటపడేలా గెంటి 'వక్క పైసా ఇవ్వకండి. ఇడి యవ్వారం నేసూత్తా' నని రంగయ్యతో వగరుస్తూ అన్నాడు.

అందరి కోపాలు కొద్దిగా సర్దుకున్నాయి. అప్పటికే చాలా పొద్దుపోయింది. రంగయ్యకి డబ్బు యివ్వాలన్న ఉద్దేశ్యము పోయింది. ఎందుకివ్వాలని మొండివాదానికి దిగాడు.

ఈసారి గురవయ్య దర్పం విడిచి కాళ్ళా వేళ్ళా పడటం మొదలు పెట్టాడు. సరసూ ఎంత పళ్ళుకొరికి బతిమాలవద్దన్నా వినేస్థితిలో లేడు.

"మీకు ఇవ్వాలని తోచింది ఇచ్చేవెయ్యండి. ఈ అర్ధరాత్రి ఈ గోలేమిటి" అని రంగయ్యతో నెమ్మదిగా సీతారత్నం అంది.

"అబ్బో మళ్ళా పెత్తనం నీకు వచ్చిందని మురుస్తున్నట్టున్నావు. నేను గట్టిగా తల్చుకుంటే ఈపాటికే నువ్వేదారో పుచ్చుకునేదానివి. మంచిదాన్ని కనక నేనే పోతున్నా తెల్సుకో. నీలా నేను ఇంత తిండిపెడితే పడుండేదాన్ని కాదు. నాకేం ఖర్మ! ఇంతోటివాడు దొరక్కపోడు. నేనే కట్టుకోవాలనుకోవాలే కాని" అంటూ అక్కసు వెళ్ళపోస్తోంది సరసూ.

వుండివుండి వాదాలు జరుగుతూనే రాత్రి కోడికూత వేళకి జరిగింది.

రంగయ్య ముందు అన్నమాటలో మూడోవంతు డబ్బే ఇస్తానని మొండిపట్టు పట్టాడు.

గురవయ్య చివరకి దానికే మొగ్గాడు.

ఎన్నో సాక్షుల సంతకాలు తీసుకొనిగాని గురవయ్య చేతికి డబ్బు ఇవ్వలేదు రంగయ్య.

సరసూ వయ్యారం; నాజూకు, సంస్కారములన్నీ వక్కసారి మూటగట్టి విసిరేసి సహజంగా గట్టిగా తిట్టిపోసింది రంగయ్యనీ, సీతారత్నాన్నీ.

చీకటి తెరలని విడిపించినట్టు సూర్యకిరణాలు బాణాల్లా సూటిగా నిద్రలేని రంగయ్య కళ్ళల్లో గుచ్చుతున్నాయి.

సీతారత్నం మనస్సులోనచీకటిని పల్చటి సూర్యబింబం తనలో కలుపుకుంది.

గాలివాన వదలిన ప్రకృతిలా ఇల్లు నిర్జీవంగా నిర్మలంగా నిల్చింది.

రంగయ్య మోడులా మార్దవంలేని కంఠంతో మాటలు మొదలెట్టాడు.

సీతారత్నం రంగయ్యకేసి రెప్ప వెయ్యకుండా చూస్తోంది. రంగయ్య మనస్సు వెన్నలాంటిదే; పైకిమాత్రం గంభీరంగా వుంటాడు. ఎంత మంచివాడు కాకుంటే అంత ఇది ఐనాడు దాన్ని వెళ్ళగొడతాడా; రంగయ్యలో మంచిగుణాలు కుప్పపోసినట్టు కనపడుతున్నాయి సీతారత్నం కళ్ళకి. ఆనందమో, దుఃఖమో తెలవటంలేదు; కళ్ళనీళ్ళు జారుతున్నాయి.

సీతారత్నంకేసి చూశాడు. ఏంటే అన్నమాటలో ఎన్నో యేళ్ళ ఆప్యాయత తొంగిచూసింది. నలిగిన కండువాతో సీతారత్నం కళ్ళు తుడిచాడు. యవ్వనం శరీరాన్ని వదలి మనస్సులో నిలిచింది. రంగయ్యలోని జాలి ఎఱ్ఱటి కళ్ళ కొలుకుల్లో తడిలా మెరిసింది. మాటలురాని పసివాడి చూపులా సీతారత్నం కంటిపాపలో కలిపి ఆరోజే నడివయసుకి మంచితనం కండువాలా కప్పి, రంగయ్య మనసు అంతాదయ, జాలితో నిండిపోయింది.

కర్పూరహారతిలో దేముడిని చూసినట్టు రంగయ్యలోని మంచితనాన్ని చూసుకు మురిసిపోయింది ఆక్షణంలో సీతారత్నం.

✧